



షణ్ముఖ RNI : APTEL / 2023 / 89152

# వెలుగు

ప్రతి వార్త వెలుగు వైపు తెలుగు దినపత్రిక





సంపుటి : 1 సంచిక : 333 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ మంగళవారం 25 మార్చి 2025 పేజీలు 8 : వెల 5/- ఒంగోలు

VOLUME : 01 ISSUE : 333 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Monday 21 October 2024 PAGES : 8 PRICE : 5/-

# కేబినెట్ కూర్పుపై కసరత్తు

- ఢిల్లీ చేరుకున్న కాంగ్రెస్ నేతలు..
- ఏఐసీసీ నూతన కార్యాలయంలో కానీ పార్టీ అధిష్టానం పెద్దలతో వీరంతా భేటీ కానున్నారు
- ఈ సమావేశంలో ప్రధానంగా కేబినెట్ విస్తరణపై చర్చించనున్నారు
- రేవంత్ రెడ్డి కేబినెట్‌లో ఆరు పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటిపై చర్చించనున్నారు
- సామాజిక సమీకరణలతోపాటు గతంలో ఇచ్చిన హామీల మేరకు వీటిని భర్తీ చేయాలని పార్టీ అధిష్టానాన్ని వారు కోరనున్నట్లు తెలుస్తోంది.



హైదరాబాద్

పార్టీ అధిష్టానం పిలుపుతో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేతలు సోమవారం సాయంత్రం ఢిల్లీ చేరుకున్నారు. మరి కాసేపట్లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నివాసంలో కానీ.. ఏఐసీసీ నూతన కార్యాలయంలో కానీ పార్టీ అధిష్టానం పెద్దలతో వీరంతా భేటీ కానున్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా కేబినెట్ విస్తరణపై చర్చించనున్నారు. రేవంత్ రెడ్డి కేబినెట్‌లో ఆరు పదవులు ఖాళీగా ఉన్నాయి. వీటిపై చర్చించనున్నారు. సామాజిక సమీకరణలతోపాటు గతంలో ఇచ్చిన హామీల మేరకు వీటిని భర్తీ చేయాలని పార్టీ అధిష్టానాన్ని వారు కోరనున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సమావేశానికి తెలంగాణ వ్యవహారాల బాధ్యురాలు మీనాక్షి నటరాజన్‌తోపాటు టీ పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ సైతం హాజరు కానున్నారు. ఇక ఈ ఢిల్లీ పర్యటనలో సీఎం రేవంత్ రెడ్డి వెంట డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతోపాటు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఉన్నారు. మరోవైపు.. రేవంత్ కేబినెట్‌లో ఆరుగురికి మంత్రి పదవులు కట్టబెట్టేందుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. మార్చి 30వ తేదీ ఉగాది. ఈ పండగ నాటికి కేబినెట్ కూర్పును పూర్తి చేయాలనే లక్ష్యంతో పార్టీ అధిష్టానం కృత నిశ్చయంతో ఉందని సమాచారం. ఆ క్రమంలో తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నేతలను ఢిల్లీకి పిలిపించారనే చర్చ సాగుతోంది. ఇంకోవైపు రంగారెడ్డి, హైదరాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నుంచి కేబినెట్‌లో చోటు లేదు. దీంతో ఆ యా జిల్లాల్లోని వివిధ సామాజిక వర్గాల నేతలంతా రేసులో ఉన్నారు. ఇక నిజామాబాద్ జిల్లాలో సుదర్శన్ రెడ్డితోపాటు పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. అలాగే ఆదిలాబాద్ జిల్లాలో ప్రేమ సాగర్ రావుతోపాటు ఎమ్మెల్యే వివేక్ పేరు సైతం వినిపిస్తోంది. వాకాటి శ్రీహరి ముదిరాజ్ పేరు వినిపిస్తోంది. అదే విధంగా నల్గొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి - మిగతా 2లో




## రేవంత్ రెడ్డి ఫ్లయిట్ మోడ్ ముఖ్యమంత్రి

- ఎమ్మెల్సీ కవిత ఎద్దేవా
- గత 15 నెలల్లో 40 సార్లు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణకు సాధించుకొచ్చింది ఏమీ లేదని
- రాష్ట్రంలో పాలన హైదరాబాద్ కేంద్రంగా నడుస్తోందా లేదా ఢిల్లీ కేంద్రంగా నడుస్తోందా?
- ఈ ముఖ్యమంత్రి ఏం చేయాలన్నా, ఏ నిర్ణయం తీసుకోవాలన్న ఢిల్లీకి వెళ్లి పర్మిషన్ తీసుకోవాలి
- కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది
- మైనారిటీలకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ నిర్ణయం తీసుకున్నా కొట్లాడటానికి బీఆర్ఎస్ పార్టీ ముందుంటుంది



## భారీగా పెరిగిన ఎంపీల జీతాలు

- గెజిట్ జారీ చేసిన కేంద్రం..
- ఎంపీల జీతాలతోపాటు అలవెన్సులు, ఫించన్లను సైతం సవరించింది.
- ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రిత్వశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ
- పెరిగిన వేతనాలు, అలవెన్సులు 2023 ఏప్రిల్ ఒకటి నుంచి వర్తిస్తాయి



## తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరిక..

- వారం రోజుల ముందు వరకు ఎండలు దంచికొట్టాయి
- 40 డిగ్రీలకుపైనే ఎండలు పెట్టాయి
- కానీ, ఇప్పుడు మాత్రం ఎండలు బాగా తగ్గాయి
- అప్పుడప్పుడు వర్షాలు కూడా పడుతున్నాయి.
- అకాల వర్షాల కారణంగా రైతులు అల్లాడిపోతున్నారు
- పంటనష్టం సంభవిస్తోంది
- వచ్చే మూడు రోజులు తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం

# బెట్టింగ్ యాప్స్ కేసులో సెలబ్రిటీలకు ఊరట?

- ఈ కేసులో ఇప్పటిదాకా 25 మంది సెలబ్రిటీలపై కేసు నమోదు అయిన సంగతి తెలిసిందే.
- కొత్త సెక్షన్లు చేర్చి మరీ వీళ్లందరినీ కేసుల్లో నిందితులుగా మార్చినట్లుగా తెలుస్తోంది.
- ఈ కేసులో ప్రముఖులను సాక్షులుగా మార్చే యోచనలో పోలీసులు ఉన్నట్లు సమాచారం.



హైదరాబాద్

ఇటు సినీ రంగ ప్రముఖులను, అటు సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లను హడలెత్తిస్తున్న బెట్టింగ్ యాప్స్ కేసులో మార్చి 24, సోమవారం కీలక మలుపు చోటు చేసుకుంది. ఈ కేసులో ఇప్పటిదాకా 25 మంది సెలబ్రిటీలపై కేసు నమోదు అయిన సంగతి తెలిసిందే. అయితే వాళ్లందరికీ ఊరట కలిగించే అవకాశం ఇప్పుడు కనిపిస్తోంది. తాజాగా ఈ కేసులో బెట్టింగ్ యాప్స్ ఓనర్లను పోలీసులు టార్గెట్ చేశారు. ఈ క్రమంలో ఇప్పటిదాకా 19 మందిపై కేసులు నమోదు చేశారు. కొత్త సెక్షన్లు చేర్చి మరీ వీళ్లందరినీ కేసుల్లో నిందితులుగా మార్చినట్లుగా - మిగతా 2లో



## విద్యా వ్యవస్థ ఆర్ఎస్ఎస్ అధీనంలోకి వెళ్తే దేశం నాశనమే

- ఇండియా' కూటమి భాగస్వామ పార్టీల మధ్య సల్ప తేడాలు ఉండవచ్చునీ
- కానీ దేశ విద్యా వ్యవస్థ విషయంలో ఎప్పుడూ రాజీపడలేదని
- "దేశ భవిష్యత్తు, విద్యా వ్యవస్థను ఒక సంస్థ నాశనం చేయాలని చూస్తోంది
- ఆ సంస్థ పేరు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్
- విద్యావ్యవస్థ వారి చేతుల్లోకి వెళ్తే దేశం నాశనమవుతుంది.

# సుప్రీం తీర్పుపై టెన్షన్

- ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ..
- గత విచారణలో ఆపరేషన్ సక్సెస్..పేషంట్ డెడ్ అనే తీరు సరికాదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు అనర్హత పిటిషన్ల పెండింగ్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది
- మార్చి 25లోగా నోటీసులకు సమాధానం ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించింది
- అయితే, ఇప్పటి వరకు స్పీకర్, ఎమ్మెల్యేలు ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. దీంతో, విచారణపై ఉత్కంఠ నెలకొంది.



ఢిల్లీ

బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అనర్హతపై సుప్రీంకోర్టులో రేపు విచారణ జరగనుంది. జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ అగస్టిన్ జార్జ్ ధర్మాసనం విచారణ చేపట్టనుంది. ఇక, గత విచారణలో ఆపరేషన్ సక్సెస్..పేషంట్ డెడ్ అనే తీరు సరికాదని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపు అనర్హత పిటిషన్ల పెండింగ్‌పై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అలాగే, ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హతపై తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, సెక్రటరీ, ఎన్నికల సంఘం, ప్రభుత్వానికి, హైకోర్టు రిజిస్ట్రార్‌కు నోటీసులు ఇచ్చింది. మార్చి 25లోగా నోటీసులకు సమాధానం ఇవ్వాలని సుప్రీంకోర్టు - మిగతా 2లో




## జస్టిస్ యశ్వంత్ వర్మ వ్యవహారంలో కీలక నిర్ణయం తీసుకున్న 'సుప్రీం!

- జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో భారీగా నోట్ల కట్టలు వెలుగు చూశాయన్న వార్తలు దేశవ్యాప్తంగా సర్వత్రా సంచలనం సృష్టించారు.
- ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకున్నది
- జస్టిస్ వర్మను తిరిగి అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసింది
- ఈ నెల 21న సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని కొలీజియం ఆయనను బదిలీ చేయాలని కేంద్రానికి సిఫారసు చేసిన విషయం తెలిసిందే.

# రేవంత్ రెడ్డి ఫ్లయిట్ మోడ్ ముఖ్యమంత్రి

**హైదరాబాద్ :** రేవంత్ రెడ్డి ఫ్లయిట్ మోడ్ సీఎం అని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. గత 15 నెలల్లో 40 సార్లు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణకు సాధించుకొచ్చింది ఏమీ లేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో పాలన హైదరాబాద్ కేంద్రంగా నడుస్తోందా లేదా ఢిల్లీ కేంద్రంగా నడుస్తోందా అని నిలదీశారు. ఈ ముఖ్యమంత్రి ఏం చేయాలన్నా, ఏ నిర్ణయం తీసుకోవాలన్న ఢిల్లీకి వెళ్లి పర్మిషన్ తీసుకోవాలని అన్నారు. రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా బాన్సువాడలోని జామా మసీద్‌లో ఏర్పాటు చేసిన దావత్ - ఏ -ఇఫ్తార్ లో మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ , బాన్సువాడ వైస్ చైర్మన్ జుబైర్ తో కలిసి ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. మైనారిటీలకు వ్యతిరేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ నిర్ణయం తీసుకున్నా కొట్లాడటానికి బీఆర్ఎస్ పార్టీ ముందుంటుందని తేల్చిచెప్పారు. మైనారిటీల అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్ పార్టీతో మాత్రమే సాధ్యమని స్పష్టం చేశారు.



### సీఎం రేవంత్ రెడ్డికి ఆ సోయి లేదు

కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న పదేళ్లలో ఒక్కటంటే ఒక్క మత ఘర్షణ కూడా జరగలేదని, కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో నెలకు ఒకటి చొప్పున మత ఘర్షణలు చోటు చేసుకున్నాయని ఎమ్మెల్సీ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. కానీ ముఖ్యమంత్రి ఏ ఒక్కరోజు ఈ ఘటనలపై సమీక్షించడం లేదని, జైనూర్ లో మూడు నెలలు ఇంటర్నెట్ బంద్ పెట్టారని, అక్కడ హిందూ ముస్లింల ఇండ్లను దహనం చేసినా ముఖ్యమంత్రికి వాటిపై సమీక్షించేంత తీరిక లేదని విమర్శించారు. బాధితులకు కనీసం పరిహారం ఇవ్వలేదని, బాధ్యులపై చర్యలు తీసుకోలేదని ఎండగట్టారు. "తెలంగాణ రాష్ట్రంలోని పేదలందరికి మంచి చేయాలనే సంకల్పంతో కేసీఆర్ పని చేశారు. ఆ సోయి ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేదు. ముస్లింలకు ఇచ్చే రంజాన్ తోఫాను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం బంద్ పెట్టడం దారుణం. మైనార్టీల కోసం పెట్టిన బడ్జెట్ లో 25 శాతం నిధులు కూడా ఖర్చు చేయలేదు. ముస్లిం యువత, మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నో కార్యక్రమాలు తీసుకువచ్చింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పట్టించుకోవడం లేదు' అని వ్యాఖ్యానించారు.

### పోచారం ఏం సలహాలు ఇస్తున్నారని.. అడ్వైజర్ పదవి

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఈద్ ముబారక్ చెప్పేందుకు వస్తారని, మైనార్టీల బడ్జెట్ ఎందుకు ప్రభుత్వం ఖర్చు చేయడం లేదని ఆయనను ప్రశ్నించండని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి కాంగ్రెస్ లో చేరి ప్రభుత్వానికి అడ్వైజర్ అయ్యారని, ఆయన ఏం సలహాలు ఇస్తున్నారో ప్రశ్నించాలని అన్నారు. మైనార్టీ గురుకులాలు కేసీఆర్ హయాంలో ఎలా ఉన్నాయి.. ఎప్పుడు ఎలా ఉన్నాయో పోచారం శ్రీనివాస్ రెడ్డి ని ప్రశ్నించాలని అని సూచించారు. బాన్సువాడకు సాగునీళ్లు రావడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, కానీ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి మాత్రం ఏం పట్టనట్టు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.

### ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు కూడా ఇవ్వలేదు

ప్రభుత్వం విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు కూడా విడుదల చేయడం లేదని, కొన్ని రోజుల్లోనే విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతుందని, ప్రభుత్వం వెంటనే ఫీ రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలవుతున్నా ఫీ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ లకు ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదని ఎండగట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో కిరణ్ కుమార్ రెడ్డి ప్రభుత్వం రూ.1,800 కోట్లు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెట్టి పోతే కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక మొదట ఆ బకాయిలు క్లియర్ చేసి విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారని, పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వంతో మాట్లాడి విద్యార్థులకు బకాయిలు ఇప్పించాలని సూచించారు.

### తులం బంగారం ఇచ్చారా?

కేసీఆర్ షాదీ ముబారక్ కింద రూ.లక్ష మాత్రమే ఇస్తున్నారు.. కాంగ్రెస్ ను గెలిపిస్తే రూ.1.60 లక్షలతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందని ఎమ్మెల్సీ కవిత గుర్తుచేశారు. మరి 15 నెలల్లో ఏ ఒక్కరికైనా రూ.1.60 లక్షలతో పాటు తులం బంగారం ఇచ్చారా? అని అడిగారు 15 నెలల్లో లక్షా 50 వేల కోట్లు అప్పులు చేసినా తులం బంగారం ఇవ్వలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాల్గొన్నవారు బాజిరెడ్డి గోవర్ధన్, బాన్సువాడ మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్, బీఆర్ఎస్ నాయకులు మొచ్చి గణేష్, సాయిబాబా, ఎజాజ్, రజాక్, సంపత్ గౌడ్, అయోషా ఫాతిమా, చాకలి సాయిలు, శివ సూరి , ఎండి ఆపోర్జ తదితరులు పాల్గొన్నారు


# కేసీఆర్ ధీమా...ఏంటీ

**హైదరాబాద్ :** మళ్లీ నేనే సీఎం.. రాస్కో సాంబా.. అంటూ గబ్బర్‌సింగ్ రేంజ్‌లో డైలాగులు కొడుతున్నారు కేసీఆర్. ఫాంహౌజ్‌లో తనను కలిసిన బీఆర్ఎస్ నాయకుల ముందు మాటల గారడీ చేస్తున్నారా? కేడర్‌ను కాపాడుకునేందుకు తనదైన స్టైల్‌లో కన్ఫ్యూజ్ చేస్తున్నారా? మాయల మరాఠీ, టక్కుటమారం విద్యలు ప్రదర్శిస్తున్నారు. కేసీఆర్ చెప్పే ముచ్చట్లు.. ఆయన ముచ్చట తీర్చేనా?కేసీఆర్ లేటెస్ట్ కామెంట్స్ పొలిటికల్‌గా కాక రేపుతున్నాయి. రాబోయే రోజుల్లో అధికారం బీఆర్ఎస్‌దే అన్నారు. ఏపీలో కూటమి లేకుంటే చంద్రబాబు సీఎం అయ్యేవారే కాదని.. తాము మాత్రం సింగిల్‌గా పవర్‌లోకి వస్తామని చెప్పారు. ఆనాడు మోదీ తన మెడపై కత్తి పెట్టినా.. తెలంగాణ కోసం తాను ఎక్కడా వెనకడుగు వేయలేదని చెప్పుకొచ్చారు. ప్రస్తుతం రాష్ట్రం సమస్యల వలయంలో చిక్కుకుందని ఆరోపించారు. బెల్లం ఉన్న దగ్గరికే ఈగలు వస్తాయని.. ఇప్పుడు తెలంగాణను దోచుకోవడానికి కొందరు సిద్ధంగా ఉన్నారని అన్నారు.కేసీఆర్ వ్యాఖ్యలపై మంత్రి సీతక్క కస్సున లేచారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ఊహాలోకంలో ఉంచండి.. మీరేమో ఫాంహౌజ్‌లోనే ఉండండి అంటూ సెటైర్లు వేశారు. మీరు ఎన్ని కలలు కన్నా.. అధికారంలోకి రావడం అసంభవం అని తేల్చి చెప్పారు సీతక్క.అటు, టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ సైతం గులాబీ బాస్‌కు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందని.. కేసీఆర్ పగటి కలలు మానుకోవాలని హితవు పలికారు. సింగిల్‌గానే కాదు.. కేసీఆర్ బీజేపీతో జతకట్టినా గెలవలేరని.. మళ్లీ అధికారం కాంగ్రెస్ పార్టీదేనని తేల్చి చెప్పారు. ఫాంహౌజ్‌లో ఉండి కేసీఆర్ ప్రగల్భాలు పలుకుతున్నారని అన్నారు. బీఆర్ఎస్ సృష్టించిన ఆర్థిక విధ్వంస పునాదుల మీద.. రైజింగ్ తెలంగాణను పునర్ నిర్మిస్తున్నామని కాంగ్రెస్ చీఫ్ తెలిపారు. అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ చూసి బీఆర్ఎస్ నేతల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. కుటుంబం కోసం తెలంగాణ ప్రయోజనాలను పదేళ్ల పాటు ప్రధాని మోదీ ముందు తాకట్టు పెట్టారని మండిపడ్డారు మహేశ్ కుమార్ గౌడ్.రాజకీయ విమర్శలు ఎలా ఉన్నా.. కేసీఆర్ వైఖరి మాత్రం ఆసక్తికరంగా మారింది. అసెంబ్లీకి రాకున్నా, ప్రజల్లోకి వెళ్లకున్నా.. ఫాంహౌజ్‌లో మకాం వేసి రాజకీయ మంటలు రాజేసే ప్రయత్నం గట్టిగా చేస్తున్నారని విశ్లేషకులు అంటున్నారు. మళ్లీ గెలుస్తామని.. తాను మరోసారి ముఖ్యమంత్రి అవుతానంటూ.. కేసీఆర్ మైండ్ గేమ్ అడుతున్నారని అంటున్నారు. అమావాస్యకో, పున్నమికో.. ఎర్రవల్లి ఫాంహౌజ్‌కు పార్టీ నేతలను రప్పించుకోవడం.. వచ్చేది మన ప్రభుత్వమే అంటూ వారికి భరోసా ఇవ్వడం కేసీఆర్‌కు రొటీన్ ప్రోగ్రామ్‌గా మారింది.కాంగ్రెస్‌లో ఏదో అయిపోతోంది.. అన్నివర్గాల్లో వ్యతిరేకత వస్తోంది.. అంటూ ఫేక్ ప్రచారాన్ని ప్రజలపై బలంగా రుద్దే ప్రయత్నం జరుగుతోందని చెబుతున్నారు. ఈ కుట్రను గుర్తించే.. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి సోషల్ మీడియా చేస్తున్న ఫేక్ ప్రచారంపై ఫైర్ అవుతున్నారు. దోచుకుని దాచుకున్న బ్లాక్ మనీతో కేటీఆరే ఇదంతా చేయిస్తున్నారని మండిపడుతున్నారు. కేటీఆర్ సోషల్ మీడియాలో.. కేసీఆర్ ఫాంహౌజ్‌లో.. ఇద్దరూ కలిసి రేవంత్ సర్కార్‌ను బద్నామ్ చేసే కుతంత్రం అమలు చేస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు కాక మీదున్నాయి. మళ్లీ తానే సీఎం అవుతానంటూ కేసీఆర్ చేస్తున్న ఈ కామెంట్స్ మైండ్ గేమ్ మినహా మరోటి కాదని.. బీఆర్ఎస్‌కు అంత సీన్ లేదని.. వచ్చే పదేళ్లు కాంగ్రెస్ ప్రభుత్వమేనని తేల్చిచెబుతున్నారు హస్తం నేతలు.



# తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ హెచ్చరిక..

గత కొద్దిరోజుల నుంచి వాతావారణంలో పెను మార్పులు చోటుచేసుకుంటున్నాయి. వారం రోజుల ముందు వరకు ఎండలు దంచికొట్టాయి. 40 డిగ్రీలకుపైనే ఎండలు పెట్టాయి. కానీ, ఇప్పుడు మాత్రం ఎండలు బాగా తగ్గాయి. అప్పుడప్పుడు వర్షాలు కూడా పడుతున్నాయి. అకాల వర్షాల కారణంగా రైతులు అల్లాడిపోతున్నారు. పంటనష్టం సంభవిస్తోంది. ఈ నేపథ్యంలోనే భారత వాతావరణ శాఖ తెలుగు రాష్ట్రాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. వచ్చే మూడు రోజులు తెలుగు రాష్ట్రాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. అంతేకాదు.. తెలంగాణ వ్యాప్తంగా ఈ రోజు వర్షం పడే అవకాశం ఉందని వెల్లడించింది. అసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ, వరంగల్, జనగామ, సిద్దిపేట, రంగారెడ్డి, హైదరాబాద్‌తో పాటు మిగిలిన జిల్లాలకు కూడా ఎల్లో అలర్ట్ జారీ చేసింది. వర్షాలు తగ్గిన తర్వాత మళ్లీ ఎండలు దంచికొడతాయని, 2-



3 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని అంది. ఉత్తర కోస్తా , యానాంలలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉందని తెలిపింది. రేపు, ఎల్లుండి పొడి వాతావరణం ఉంటుందని వెల్లడించింది. తర్వాతినుంచి ఎండలు మరింత పెరుగుతాయని పేర్కొంది. దక్షిణ కోస్తా, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. ఒకటి రెండు చోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. తర్వాతినుంచి ఎండలు పెరుగుతాయి. ఇక, రాయలసీమలోనూ ఈ రోజు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని చోట్ల ఉరుములతో కూడిన జల్లులు పడే అవకాశం ఉంది. ఈదురుగాలులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే అవకాశం ఉంది. రేపటి నుంచి ఎండలు రెండు, మూడు డిగ్రీలు పెరిగే అవకాశం ఉంది. కాగా, అకాల వర్షాలు, వడగండ్ల వాన కారణంగా వివిధ జిల్లాల్లో జరిగిన పంటనష్టంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. వడగళ్ల వాన కారణంగా కడప, అనంతపురం, సత్యసాయి, ప్రకాశం జిల్లాల్లోని 10 మండలాల్లో.. దాదాపు 40 గ్రామాల్లో పంటనష్టం జరిగిందని అధికారులు వివరించారు. తెలంగాణలోని కరీంనగర్ జిల్లాలోని 13 గ్రామాల్లో 336 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

## కేబినెట్ కూర్పుపై కసరత్తు

-మొదటిపేజీ తరువాయి

రాజ్‌గోపాల్ రెడ్డి పేరు సైతం వినిపిస్తోంది. అయితే ఎంపీ ఎన్నికల్లో భువనగిరి నుంచి చామల కిరణ్ కుమార్ రెడ్డిని గెలిపిస్తే.. కేబినెట్‌లో బర్త్ కేటాయిస్తామంటూ అధిష్టానం కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఆఫర్ ఇచ్చినట్లు ఓ చర్చ సైతం గతంలో వైరల్ అయింది. ఆయన గెలుపుతో తనకు కేబినెట్‌లో చోటు కన్‌ఫార్మ్ అని రాజగోపాల్ రెడ్డి ఇప్పటికే ధీమా వ్యక్తం చేస్తున్నారు. అదీకాక.. రాజగోపాల్ రెడ్డికి కేబినెట్‌లో చోటు కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సైతం సానుకూలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో భేటీ అనంతరం వీరంతా ఈ రోజు రాత్రి పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. అలాగే ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికైన విజయశాంతి పేరు సైతం కేబినెట్‌లో కూర్పు కోసం జరుగుతోన్న చర్చలో వచ్చే అవకాశముందని తెలుస్తోంది.

## బెట్టింగ్ యాప్స్ కేసులో సెలబ్రిటీలకు ఊరట?







-మొదటిపేజీ తరువాయి

తెలుస్తోంది. ఈ మేరకు మియాపూర్ పోలీసులు కోర్టులో మెమో సైతం దాఖలు చేశారు. అయితే ఈ కేసులో ప్రముఖులను సాక్షులుగా మార్చే యోచనలో పోలీసులు ఉన్నట్లు సమాచారం. బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ చేసిన ప్రముఖులకు ఇప్పటికే చాలామంది నోటీసులు పంపించారు. కొందరిని విచారించగా.. మరికొందరిని విచారించాల్సి ఉంది. ఈ క్రమంలో యాప్ ప్రమోషన్స్ చేసిన వాళ్ళ స్టేట్మెంట్ రికార్డ్ చేసిన అనంతరం.. ఛార్జ్ షీట్ లో సాక్షులుగా చేర్చే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే పలువురు ప్రముఖులు తమ ప్రమేయం లేకుండా వాటిని ప్రమోట్ చేశామని, పర్యవసనాలకు ఊహించలేదని వివరణలు ఇస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్ లావాదేవీలపైనా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఫోకస్ చేసినట్లు సమాచారం. బెట్టింగ్ యాప్స్ కేసు విచారణ దశలో ఉంది. ఈ కేసులో పోలీసుల విచారణకు సహకరిస్తా. ఇకపై బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేయను

### బెట్టింగ్ యాప్ కేసు.. వారే టార్గెట్‌గా పోలీసుల యాక్షన్

రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తోన్న బెట్టింగ్ యాప్స్ కేసులో కీలక మలుపు చోటు చేసుకుంది. 19 మంది బెట్టింగ్ యాప్ ఓనర్లపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. యాప్ల యజమానులే లక్ష్యంగా పోలీసుల చర్యలు చేపట్టారు. ఈ కేసులో సెలబ్రిటీలను సాక్షులుగా చేర్చే యోచనలో పోలీసులు ఉన్నట్లు తెలుస్తోంది. యాప్ నిర్వాహకులే టార్గెట్‌గా కొత్త సెక్షన్లు ప్రయోగిస్తున్నారు. మొత్తం 19 మందిని నిందితులుగా చేర్చి విచారణ చేపట్టనున్నారు. ఈ వ్యవహారంలో కోర్టులో మియాపూర్ పోలీసులు మెమో దాఖలు చేశారు. యాప్ ప్రమోషన్స్ చేసిన వాళ్ళ స్టేట్‌మెంట్ రికార్డ్ చేయనున్నారు. బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్ చేసిన వారిని ఛార్జ్ షీట్‌లో సాక్షులుగా చేర్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు బెట్టింగ్ యాప్ కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ఓవైపు ఇన్ఫ్లూయెన్సర్లను, యూట్యూబర్లను కూడా పోలీసులు విచారిస్తున్నారు. ఇప్పటి వరకు యాప్స్ ప్రమోషన్స్ చేసిన వారి మీదనే కేసులు నమోదు చేసిన పోలీసులు.. తాజాగా యాప్స్ ఓనర్స్‌పై ఫోకస్ చేశారు. ఇందులో భాగంగా సుమారు 19 మంది బెట్టింగ్ యాప్ ఓనర్లపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇందులో వివిధ రకాల బెట్టింగ్ యాప్స్ ఉన్నాయి. వీరంతా కూడా కొంతకాలంగా ఈ బెట్టింగ్ యాప్స్‌కు యాజమానులుగా ఉన్నారు. అయితే బెట్టింగ్ యాప్స్ వల్ల చాలా మంది నష్టపోయారు. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్ చేసిన వారిని మాత్రమే కాకుండా బెట్టింగ్ యాప్ ఓనర్లను లక్ష్యంగా చేసుకుని పోలీసులు చర్యలు చేపట్టారు. ఇందుకు అనుగుణంగానే ప్రమోటర్లను కాకుండా బెట్టింగ్ యాప్ యాజమాన్యాలపై కేసులు నమోదు చేశారు. ఇక.. బెట్టింగ్ యాప్స్‌కు ప్రమోషన్ చేసి వారిని విచారణకు పిలిచి వారి వద్ద నుంచి స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తున్నారు పోలీసులు. ప్రమోటర్స్ స్టేట్‌మెంట్లనే కాకుండా బెట్టింగ్ యాప్స్ యాజమాన్యులను కూడా ఇందులో భాగస్వాములను చేసే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఇన్ఫ్లుయెన్సర్లను చార్జ్‌షీట్‌లో సాక్షులుగా పరిగణించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు బెట్టింగ్ ఇన్ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్ల చుట్టూ తిరిగి ఈ వ్యవహారం ఇప్పుడు బెట్టింగ్ యాప్స్ ఓనర్ల మెడకు చుట్టుకోబోతోంది.

## సుప్రీంకోర్టు తీర్పుపై టెన్షన్



-మొదటిపేజీ తరువాయి

ఆదేశించింది. అయితే, ఇప్పటి వరకు స్పీకర్, ఎమ్మెల్యేలు ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. దీంతో, విచారణపై ఉత్కంఠ నెలకొంది. ఇదిలా ఉండగా.. సుప్రీంకోర్టులో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, గూడెం మహిపాల్ రెడ్డి అఫిడవిట్లు ఉన్నాయి. ఈ సందర్భంగా అఫిడవిట్‌లో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి..'నేను ఎన్నడూ బీఆర్ఎస్ పార్టీ వీడలేదు. బీఆర్ఎస్‌కు నేను రాజీనామా చేయలేదు. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడూ చేరలేదు. మీడియాలో వచ్చిన వార్తల్లో నిజం లేదు. అనర్హత పిటిషన విచారణకు అర్హత లేదు. నాకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లను డిస్మిస్ చేయాలని కోరారు. అలాగే, కేటీఆర్ ఉన్న ఫొటోలు, పోస్టర్లను అఫిడవిట్‌లో జత చేశారు. కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలో తన ఫొటో ఉంచడంపై ఫిర్యాదు కాపీని కూడా జత చేశారు. మరోవైపు.. గూడెం మహిపాల్ రెడ్డి అఫిడవిట్ ఇలా ఉంది. అఫిడవిట్ ప్రకారం.. నేను మర్యాదపూర్వకంగానే సీఎం రేవంత్‌ను కలిశాను. వ్యక్తిగత హోదాలోనే ఆయనను కలిశాను. ఆ మీటింగ్‌కు ఎలాంటి రాజకీయ ప్రాధాన్యత లేదు. నాకు పార్టీ మారే ఆలోచనే లేదు. బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు హాజరవుతూనే ఉన్నాను. నేను బీఆర్ఎస్ పార్టీ సభ్యుడిగానే కొనసాగుతున్నాను. ఏ దశలోనూ బీఆర్ఎస్‌ను వీడలేదు. మీడియాలో తప్పుడు వార్తలు ప్రచారం చేశారు. నాపై అనర్హత అనే ప్రశ్న తలెత్తదు. నేను స్వచ్ఛందంగా బీఆర్ఎస్ నుంచి తప్పుకున్నట్లుగా నా చర్యలను భావించవద్దు అని తెలిపారు.

# మున్సిపాలిటీల్లో పన్నులు తగ్గించడానికి చర్యలు తీసుకోండి

ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్

అసెంబ్లీ సెషన్ లో ప్రభుత్వానికి విజ్ఞప్తి



**షణ్ముఖ వెలుగు డోర్నకల్ ప్రతినిధి మార్చి 24:** డోర్నకల్ నియోజక వర్గ మరిపెడ మున్సిపాలిటీలో పన్నులు తగ్గించాలని ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రామచంద్ర నాయక్ అన్నారు .అసెంబ్లీ సెషన్ లో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో ఆనాటి ప్రజా ప్రతినిధుల,రాజకీయ నాయకుల లబ్ధి కొరకు చుట్టుపక్కల తండాలను కలిపి నిబంధనలకు విరుద్ధంగా మున్సిపాలిటీ లుగా చేసి, కొత్త విధానం తో ప్రజలపై అత్యధిక పన్నుల భారం మోపడం తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇట్టి విషయమై ప్రజలు తమ సమస్యలను మాకు విన్నవించుకోవడం జరిగింది. పలుమార్లు ఆందోళన కూడా చేశారు,కావున 3వ గ్రేడ్ మున్సిపాలిటీలైన డోర్నకల్, మరిపెడ మున్సిపాలిటీల్లో పన్నులు సవరించి పేద ప్రజలకు మేలు చేకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వ భూముల్లో ఇండ్లు నిర్మించుకున్న పేద ప్రజలకు నిబంధనలకు లోబడి ఇంటి నెంబర్ ఇవ్వడం ద్వారా పన్ను వసూలుతో ప్రభుత్వానికి ఆదాయం చేకూరుతుంది కావున ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టి సహకారం అందించవలసిందిగా కోరారు.

# ప్రగతి సేవా సమితి సేవలను ఉపయోగించుకోండి


ప్రగతి సేవా సమితి జిల్లా కో ఆర్డినేటర్ ఐనాల పరశు రాములు

మార్చి 26న, తానంచర్ల లో ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ శిబిరం



**షణ్ముఖ వెలుగు డోర్నకల్ ప్రతినిధి మార్చి 24:** మార్చి 26న, తానంచర్ల గ్రామంలో ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత కంటి ఆపరేషన్ శిబిరాన్ని వినియోగించుకోవాలని ప్రగతి సేవా సమితి మహబూబాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ ఐనాల పరశురాములు కోరారు. ప్రగతి సేవా సమితి వ్యవస్థాపకులు గద్దల జాన్ ఆదేశానుసారం మండల నలుమూలల నుండి ఉచిత కంటి ఆపరేషన్ ప్రోగ్రాం కు గత వారం రోజులుగా మండల కో ఆర్డినేటర్ జినక సువార్త తన సిబ్బందితో క్యాంపెయిన్ చేస్తున్న సందర్భంగా సోమవారం మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలంలోని తానంచర్ల గ్రామ పంచాయతీ ఆవరణలో రివ్యూ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఐనాల పరశురాములు మాట్లాడుతూ ఈనెల 26న స్థానిక గ్రామపంచాయితీ కార్యాలయంలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు శంకర కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రగతి సేవా సమితి ఆధ్వర్యంలో పూర్తి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శంకర కంటి ఆసుపత్రి నందు ఉచితంగా కంటి ఆపరేషన్ లు చేయిస్తామని తెలిపారు. ఉచిత కంటి ఆపరేషన్ శిబిరానికి వచ్చే రోగులు ఆధార్ కార్డు జిరాక్స్ మరియు ఫోన్ నెంబర్, వారు వివిధ జబ్బులకు రెగ్యులర్ గా వాడే మందులు తప్పని సరిగా వెంట తెచ్చుకోవాలని తెలిపారు. వినికిడి లోపం ఉన్నవారు మాత్రమే వెంట సహాయకులను తీసుకొని రావాలని , వెంట ఒక జత బట్టలు అవసరమైన సామాగ్రి తెచ్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రగతి సేవా సమితి మరిపెడ మండల కో ఆర్డినేటర్ జినక సువార్త, తానంచర్ల ఏరియా కో ఆర్డినేటర్ తప్పేట్ల సతీష్ , అబ్బాయిపాలెం కో ఆర్డినేటర్ జినక కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్,గ్రేటర్ వరంగల్ హన్మకొండ జిల్లాల ఎన్ హెచ్ఆర్సి కమిటీ సభ్యుల నియామకాలు



**షణ్ముఖ వెలుగు కమలా పూర్ మండల ప్రతినిధి మార్చి 24:** జాతీయ మానవ హక్కుల కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ మహమ్మద్ యాసిన్, రాష్ట్ర అధ్యక్షులు బద్దిపడిగా శ్రీనివాస్ రెడ్డి ల ఆదేశాలతో జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బాల్నే లక్ష్మి వరంగల్ జిల్లా చైర్మన్ గంగుల అశోక్, హన్మకొండ జిల్లా చైర్మన్ దుబసి నవీన్, వైస్ చైర్మన్ జగన్ మోహన్ మరియు కన్వీనర్ ఇందిరా, గ్రేటర్ జనరల్ సెక్రటరీ టి.రజిత(లహరి) ఆధ్వర్యంలో హన్మకొండలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీ గా డా. అడేపు మధుసూదన్, వరంగల్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గా ఐలోని అభిషేక్, హన్మకొండ జిల్లా కి జాయింట్ సెక్రటరీ గా జి. వెంకటేష్, సోషల్ మీడియా కన్వీనర్ గా కొమ్ము రాజు,కో -కన్వీనర్ గా బి.సుజాత, గ్రేటర్ జాయింట్ సెక్రెటరీ గా తోట మహేష్, కో కన్వీనర్ హ ఆకుల ప్రత్యూష, వరంగల్ మండల చైర్మన్ గా ఆకుల అశోక్ ని నియమించడం జరిగింది. అనంతరం నూతనంగా ఎన్నికైనా సభ్యులు మాట్లాడుతూ.తమ పై నమ్మకం ఉంచి ఈ పదవులు ఇచ్చినందుకు రాష్ట్ర చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ హెచ్ఆర్సి సంస్థలో సభ్యులు గా ఎల్లప్పుడూ రాష్ట్ర చైర్మన్ కి సహకరిస్తామని సంస్థ యొక్క నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తానని, పేద ప్రజల తరపున చట్టపరమైన ప్రక్రియలో మనవ హక్కులకు భంగం కలుగకుండా కృషి చేస్తామని, సంస్థ కి కట్టుబడి పనిచేస్తామని అన్నారు.

## పెట్రోల్ పంపులో ఉచిత సేవలు లేకపోతే కఠిన చర్యలు తప్పవు

వనపర్తి జిల్లా ఐహెచ్ఆర్సి ప్రెసిడెంట్ : తరుణ్

పెట్రోల్ బంకులు ఉచిత సేవ గురించి తెలుసా



**షణ్ముఖ వెలుగు పెబ్బేరు మండల ప్రతినిధి మార్చి 24:** పెబ్బేరు మున్సిపాలిటీ పరిధిలోని పెట్రోల్ బంకుల్లో డీజిల్ పోయించుకున్నా లేకున్నా కొన్ని సేవలను ప్రజలు ఉచితంగా పొందవచ్చు. అలాగే కష్టమర్ల పట్ల బంకు సిబ్బంది దురుసుగా ప్రవర్తించినా పెట్రోల్ లేదా డీజిల్ నాణ్యత లోపించినా చమురు సంస్థలకు ఫిర్యాదు చేయవచ్చని వనపర్తి జిల్లా అంతర్జాతీయ మానవ హక్కుల సమితి అధ్యక్షులు తరుణ్ పేర్కొన్నారు.

**ఉచిత సేవలు**

1) స్వచ్ఛమైన తాగునీరు ఉండాలి, 2) ఎయిర్ మిషన్ ఉండాలి,3) ఫిర్యాదు బాక్స్ ఉండాలి, 4)మరుగుదొడ్లు ఉండాలి. 5)వినియోగానికి అత్యవసరం లో మొబైల్ లేనప్పుడు వినియోగదారుడు మాట్లాడుకోవడానికి పెట్రోల్ బ్యాంకులో ఫోన్ అందుబాటులో ఉండాలి, ఈ ఉచిత సదుపాయాలు లేనప్పుడు అలాంటి సమయంలో ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియదు కావున. ఫిర్యాది నెంబర్ లు ఇండియన్ ఆయిల్ 1800233355, హెచ్ పి 18002333555, భారత్ పెట్రోలియం.1800224344 నెంబర్ లకు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని ప్రజలకు తెలియజేశారు

## నీటి కొరత సమస్యను తీర్చిన ఎమ్మెల్యే



**షణ్ముఖ వెలుగు శ్రీ రంగాపురం మండల ప్రతినిధి మార్చి 24:** శ్రీ రంగాపురం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో గత రెండు నెలలుగా ప్రజలు నీటి కొరతతో ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీహరి రాజు సమస్యను వెంటనే వనపర్తి ఎమ్మెల్యే దృష్టికి తీసుకు పోగా ఎమ్మెల్యే ఆదేశాలతో ప్రజలకు నీటి సమస్య ఉండకూడదని కొత్త మోటార్ లతో మరమ్మత్తులు చేయించడం జరిగింది. నీటి సమస్యను తీర్చి నందుకు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆశన్న,బీసీ కాలనీ ప్రజలు రాఘవేంద్ర,బోరింగ్ బుచ్చన్న ,కురుమూర్తి,బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## పసుపునూరి వీరేశం కు ఉగాది పురస్కార అవార్డు



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి మార్చి 24:** సర్వేజనా సుఖినోభవంతు జాతీయ సంస్థ హైదరాబాద్ లోని సుందరయ్య కళాభవన్ లో జరిగిన అవార్డ్స్ ప్రదానోత్సవం లో సమాజ సేవల గుర్తింపుకు గాను యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణానికి చెందిన పసుపు నూరి వీరేశం కు సేవా రత్న అవార్డు మరియు ఉగాది పురస్కార్ అవార్డులను రాష్ట్ర మానవ హక్కుల సంఘం చైర్మన్ మరియు దైవజ్ఞ శర్మ చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు. అన్న, వస్త్ర దానాలు, రక్తదాన శిబిరాలు, చలివేంద్రాలు తదితర సేవా కార్యక్రమాలతో పాటు కరోనా సమయంలో కూడా సేవలు అందించడం, అలాగే ఆలేరు లో ఉండే ప్రధాన సమస్యలపై ఉద్యమాలను వీరేశం నిర్వహించారు. సేవా రంగంలో ఇలాంటి సంస్థలు ప్రోత్సహించడం చాలా సంతోషకరమైన విషయమని ఇలాంటి ప్రోత్సాహం ఇతరులు కూడా స్ఫూర్తి పొందే అవకాశం ఉంటుందని, కావున ప్రతి ఒక్కరూ సమాజ సేవకు ముందుకు రావాలని ఈ సందర్భంగా పసుపు నూరి వీరేశం కోరారు.

## పారిశుద్ధ కార్మికుల వేతనాలు 18 వేలకు పెంచాలి

: ఎమ్మెల్యే కెపి.వివేకానంద్



**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి మార్చి 24:** తెలంగాణ బడ్జెట్ సమావేశాల్లో పారిశుద్ధ కార్మికుల జీతభత్యాలపై బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ మాట్లాడుతూ.. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కార్మిక పక్షపాతిగా, బిఆర్ఎస్ పార్టీ అధినేత కెసిఆర్ ఎంతో దాతృత్వంతో నాడు పారిశుద్ధ కార్మికుల జీతాలను 7000 నుంచి 12 వేలకు పెంచగా, 2023 ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ నూతన ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 18 వేల రూపాయలు ఇస్తామని కార్మికులకు హామీ ఇచ్చారు. కాబట్టి ప్రభుత్వం వెంటనే పారిశుద్ధ్య కార్మికుల జీతాలను 18 వేల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. రోడ్లను యంత్రాల ద్వారా ఊడిచేందుకు రామ్ కీ సంస్థకు పనులను అప్పజెప్పినా, అది ఆచరణలో సాధ్యం కాలేదు. ప్రస్తుతం రోడ్లను కార్మికులే ఊడుస్తున్నా బిల్లులు మాత్రం రాంకీకి చెల్లిస్తున్నారు.

## పోషక ఆహారం తో క్షయ వ్యాధి దరిచేరదు



**షణ్ముఖ వెలుగు హుజురాబాద్ టౌన్ ప్రతినిధి మార్చి 24:** పోషక ఆహారం తో క్షయ వ్యాధి దరిచేరదని హుజురాబాద్ ఆర్ఏంఒ సుధాకర్ రావు అన్నారు.కరీంనగర్ జిల్లా హుజురాబాద్ పట్టణంలో వరల్డ్ టిబి డే ను పురస్కరించుకొని డిప్యుటీ డిఎంహెచ్వో, ఏరియా హాస్పిటల్ హుజురాబాద్, చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రధాన వీధులలో టీబి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా హుజురాబాద్ ఆర్ఎంవో సుధాకర్ రావు మాట్లాడుతూ.. క్షయ వ్యాధి గురించి రోగులు భయపడాల్సిన అవసరం లేదని, డాక్టర్ల సూచన మేరకు క్రమం తప్పకుండా కోర్సు వాడితే నయం అవుతుందని రోగులకు సూచించారు. క్షయ రోగుల కోసం ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత పరీక్షలు, మందులు, పోషక ఆహార నిమిత్తం నెలకు రూ.1000 అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మధుకర్, మెడికల్ ఆఫీసర్ జరీనా, ఎంఎల్ హెచ్ పి బంజారా ప్రతాప్, విజేందర్ రెడ్డి, సమ్మయ్య, శ్రీనివాస్ రెడ్డి, కిరణ్, దేవదర్, సుజాత తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ ఆశయ సాధనకై పోరాడుదాం

- సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ



**షణ్ముఖ వెలుగు ఆలేరు ప్రతినిధి మార్చి 24:** భగత్ సింగ్ ఆశయం సామ్రాజ్యవాదాన్ని కూల్చడం, భారతీయులకు విముక్తి కలిగించడమే లక్ష్యంగా ఇంక్విలాబ్ జిందాబాద్ రణ నినాదంతోనే పోరాటాన్ని సాగించారని, ఆయన ఆశయ సాధనకై పోరాడాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ డివిజన్ కార్యదర్శి ఇక్కిరి సహదేవ్, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు పద్మ సుదర్శన్ అన్నారు. ఆలేరు మండలం మందనపల్లి లో సోమవారం నిర్వహించిన భగత్ సింగ్ 94 వ వర్ధంతిని పురస్కరించుకుని భగత్ సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి రెండు నిముషాలు మౌనం పాటించి ఘన నివాళు లర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ భారతీయులను బ్రిటీష్ దోపిడీ, పీడనల నుండి విముక్తి చెయ్యడమనేది విప్లవం ద్వారానే సాధ్యమని భావించిన భగత్ సింగ్ 12 వ యేటనే తన అనుచరులు రాజ్ గురు, సుఖ్ దేవ్,చంద్ర శేఖర్ అజాద్ తదితరులతో కలిసి బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడిన విప్లవ యోధులు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రజాసంఘాల నాయకులు తమ్మడి అంజయ్య, కడకంచి సత్యనారాయణ, ఆర్ ఉదయ్, ఎలగందుల సిద్దులు, పద్మ శశిరేఖ, తమ్మడి ఉమా, పద్మ సుస్మిత, సిరిమర్తి శాంతమ్మ, దార భాస్కర్, శ్రీను, కుర్రి మార్కండేయ, కడకంచి అంజయ్య, కడకంచి బీరయ్య, కడకంచి రమేష్, సుంచు రాములు, కొమ్మిడి గోపాల్ రెడ్డి, గోవిందు పరమేష్, కొమ్మిడి నరసింహారెడ్డి, కర్రే సత్తయ్య, పద్మ కృష్ణ, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఫాక్స్ సాగర్ చెరువులో రెండు మృతదేహాలు లభ్యం

బైక్ అదుపు తప్పి చెరువు లో పడినట్లు పోలీసుల అనుమానం



**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి మార్చి 24:** రాత్రి వేళల్లో ద్విచక్ర వాహనంపై వెళు న్న ఇద్దరు వ్యక్తులు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందారు. నగర శివారు పేట్ బషీరాబాద్ పోలీసు స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం ఆరు గంటలకు 100 నెంబర్ కు కాల్ వచ్చిన సమాచారం మేరకు సమీపంలో ఉన్న ఫాక్స్ సాగర్ చెరువులో రెండు గుర్తు తెలియని మగ మృతదేహాలు తేలి ఆడుతూ కనిపిస్తున్నాయి అని పోలీసులకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా అందులో ఒకరు సమీపంలో గల ఉమా మహేశ్వర్ కాలనీ నివాసితులు నామ్ దేవ్(45)గా గుర్తింపు. శనివారం రాత్రి 10 గంటల సమయంలో తన బంధువైన బాలాజీ తో నామ్ దేవ్ ఇంటి నుండి తన ద్విచక్ర వాహనం పై బయటకు వెళ్లి దగ్గర్లో ఉన్న బార్ నందు ఇద్దరు మద్యం సేవించి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో ఫాక్స్ సాగర్ చెరువు కట్ట మీదకి అర్ధరాత్రి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా చీకట్లో దారి కనపడక ద్విచక్రవాహనం తో సహా చెరువులో పడి మృతి చెందారని పేట్ బషీరాబాద్ పోలీసులు తెలిపారు. మరో మృతదేహం వివరాలు తెలియాల్సివుంది అని ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు పోస్టు మార్టం నిమిత్తం మృత దేహాలను గాంధీ ఆసుపత్రికి తరలించారు. పెట్ బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## నయీమ్ ఆస్తులపై అక్రమార్కుల కన్ను



**నల్గొండ :** నయీమ్ ఎప్పుడో ఎన్‌కౌంటర్‌లో పోయాడు. కానీ.. అతను సంపాదించిన అక్రమాస్తులు అలాగే ఉన్నాయి. ఇప్పుడు.. నయీమ్ పేరుపై ఉన్న అక్రమ భూములపై కొందరి కన్నుపడింది. సిట్ విచారణతో.. నయీమ్‌కు సంబంధించిన భూముల్ని ప్రభుత్వం నిషేధిత జాబితాలో పెట్టింది. కానీ.. కొందరు బడాబాబులు అధికారులతో కలిసి.. ఆ భూముల్ని రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారుస్తున్నారు. ఇప్పుడు మీరు చూస్తున్న ఈ వెంచర్.. చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలోనిది. విజయ్ జేబీ ఇన్‌ఫ్రా పేరిట భారీ హోర్డింగులు పెట్టి.. 222 ఎకరాల లే అవుట్ అంటూ ప్రకటనలిస్తున్నారు. అయినా.. అధికారులు పట్టించుకోవట్లేదు. 1991లో ఎస్వీఎస్ రియల్ పేరుతో.. 108 ఎకరాల స్థలం ఇది. తర్వాత.. విజయ్ జేబీ ఇన్‌ఫ్రా వాళ్లు కొనుగోలు చేసి.. 222 ఎకరాల మెగా లేఅవుట్‌గా డెవలప్ చేశారు. ప్లాట్లు అమ్మేస్తున్నారు. అక్కడున్న పరిస్థితుల్ని తెలుసుకోగా.. కేవలం 108 ఎకరాల భూమి మాత్రమే లేఅవుట్‌కి సంబంధించింది. సర్వే నెంబర్ 12, 13, 14లో ఉన్న 56 ఎకరాలు నయీమ్ పేరిట ఉన్న భూములు. అదేవిధంగా సర్వే నెంబర్ 17, 18లో 26 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇలా.. మొత్తంగా 80 ఎకరాల భూముల్ని.. అక్రమంగా వెంచర్‌లోనే కలిపేశారు. 108 ఎకరాలున్న లేఅవుట్‌ని.. 222 ఎకరాలుగా చూపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయాన్ని బిగ్ టీవీ వెలుగులోకి తీసుకురావడంతో.. హోర్డింగుల్లో 222 ఎకరాలు కనబడకుండా కవర్ చేశారు. విజయవాడ హైవే నుంచి వెంచర్‌లోకి వేసిన రోడ్డుకు.. 30 ఫీట్ల వరకే పర్మిషన్ ఉంది. అడ్డదారిలో.. 60 ఫీట్ల రోడ్డు కోసం పర్మిషన్ తెచ్చుకోవడం కూడా చర్చనీయాంశంగా మారింది.

విజయ్ జేబీ ఇన్‌ఫ్రా వెంచర్ వ్యవహారాన్ని..యాదాద్రి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లింది. దీనిపై సీరియస్‌గా స్పందించిన అధికార యంత్రాంగం.. ఆర్డీవోతో విచారణ జరిపిస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలతో రంగంలోకి దిగిన చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి.. లే అవుట్ కేవలం 108 ఎకరాలు మాత్రమేనని చెబుతున్నారు. జనాన్ని మోసం చేసేలా.. 222 ఎకరాలుగా చూపుతూ.. ప్రభుత్వ భూమిని కాజేయాలని చూసిన విజయ్ జేబీ ఇన్‌ఫ్రాపై చర్యలు తీసుకుంటామంటున్నారు. నయీమ్ పేరిట ఉన్న భూములు నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ.. కొందరు బడా వ్యాపారులు రాజకీయ పలుకుబడితో, అధికారుల అండదండలతో కలిసి అక్రమంగా కబ్జా చేయాలని చూస్తున్నారని.. అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## టన్ను మామిడి రూ.1.22 లక్షలు

**వరంగల్ :** వేసవి వచ్చేసింది?! దీంతో తెలుగు రాష్ట్రాల్లో మామిడపండ్ల సీజన్ మొదలైపోయింది. ఇప్పటికే కోతకు వచ్చిన పంటను? మార్కెట్లకు తరలిస్తున్నారు. పలుచోట్ల విక్రయాలు కూడా కొనసాగుతున్నాయి. అయితే ఇందులో బంగినపల్లి మామిడికి మంచి పేరు ఉంటుంది. మామిడిలో ఎన్నో రకాలు ఉన్నప్పటికీ? బంగినపల్లికి ప్రత్యేకమైన గుర్తింపు ఉన్న సంగతి తెలిసిందేస్థానికం నుంచి ప్రపంచం వరకు బంగినపల్లి మామిడిపండ్లు ఎగుమతి చేస్తుంటారు. అయితే గురువారం వరంగల్ లోని ఎనుమాముల ముసలమ్మకుంటలో నూతన మామిడి మార్కెట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా బంగినపల్లి మామిడి రికార్డ్ ధర పలికింది. జిల్లా కలెక్టర్ తో పాటు మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో తొలిసారిగా మార్కెట్ లో నిర్వహించిన వేలంలో వ్యాపారులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఇందులో బంగినపల్లి మామిడికి టన్ను రూ. 1.22 లక్షల వరకు పలికింది. ఈ సీజన్ లోనే కాదు మార్కెట్ చరిత్రలోనే ఇంత ధర పలకటం ఇదే తొలిసారని అధికారులు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన విజయపాల్ రెడ్డి ఈ పంటను పండించాడు. మార్కెట్ వేలంలో రూ. 1.22 లక్షలు చెల్లించి కొనుగోలు చేశారు.

## నల్గొండలో బర్డ్ ఫ్లూ కలకలం



**నల్గొండ :** తెలంగాణలో మరొకసారి బర్డ్ ఫ్లూ కలకలం రేపింది. నల్గొండ జిల్లా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలోని ఫామ్‌లోని కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిందని అధికారులు నిర్ధారించారు. యాదాద్రి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలం దోతిగూడెం గ్రామంలోని ఒక కోళ్ల ఫామ్‌లోనూ.. 500 కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకి మృతి చెందాయి, దీంతో 52 వేల కోళ్లు, 17 వేల కోడి గుడ్లు, 85 టన్నుల దానాను భూమిలో పూడ్చిపెటినట్టు అధికారులు వెల్లడించారు. బర్డ్ ఫ్లూ కారణంగా నష్టాల్లో కూరుకుపోతున్నామని.. కోళ్ల ఫారం యజమానులు, మాంసం వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోనూ బర్డ్ ఫ్లూ కలకలం రేగింది. దీంతో అధికారులు అలర్ట్ అయి.. నివారణ చర్యలు చేపట్టారు. రైతులు, ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బర్డ్ ఫ్లూ అనేది ఏవియన్ ఇన్ఫ్లుఎంజా వైరస్ వల్ల వచ్చే ఒక ఇన్ఫెక్షన్. ఇది ప్రధానంగా పక్షులను ప్రభావితం చేస్తుంది. కానీ కొన్నిసార్లు మనుషులకు కూడా సోకుతుంది. బర్డ్ ఫ్లూ లక్షణాలు సాధారణ ఫ్లూ లక్షణాలను పోలి ఉంటాయి, కానీ కొన్ని సందర్భాల్లో మరింత తీవ్రంగా ఉంటాయి. జ్వరం.. సాధారణంగా 100ళీఈ (38ళీఅ) కంటే ఎక్కువ ఉంటుంది. పొడి దగ్గు లేదా రక్తంతో కూడిన దగ్గు కూడా రావచ్చు. గొంతులో మంట, నొప్పిగా ఉంటుంది. కండరాల నొప్పులు, శరీరం మొత్తం నొప్పులు వస్తాయి. తీవ్రమైన తలనొప్పి వస్తుంది. ఊపిరి తీసుకోవడం కష్టమవుతుంది. కడుపులో వికారం, వాంతులు అవుతాయి. విరేచనాలు అవుతాయి. కళ్లు ఎర్రబడతాయి. నీరు కారుతాయి. కొన్ని తీవ్రమైన సందర్భాల్లో బర్డ్ ఫ్లూ న్యుమోనియా, శ్వాసకోశ వైఫల్యం, ఇతర ప్రాణాంతక సమస్యలకు దారితీయవచ్చు. ఫారమ్‌లలో కఠినమైన బయోసెక్యూరిటీ ప్రోటోకాల్‌లను అమలు చేయాలి. పౌల్ట్రీ కేంద్రాలను క్రిమిసంహారక చేయడం, చనిపోయిన పక్షుల మృతదేహాలను సరిగ్గా పాతిపెట్టాలి. పక్షుల నమూనాలను సకాలంలో సేకరించి నిర్ధారణ పరీక్షలు చేయించాలి. పౌల్ట్రీ కార్మికులకు, పక్షులతో దగ్గరగా ఉండే ప్రజలకు టీకాలు వేయాలి. బర్డ్ ఫ్లూ వైరస్‌కు వ్యతిరేకంగా టీకాలను అభివృద్ధి చేశారు. బర్డ్ ఫ్లూ వ్యాప్తిని పర్యవేక్షించడానికి, నియంత్రించడానికి ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలి. పశుసంవర్ధక శాఖ అధికారులు పౌల్ట్రీ ఫారమ్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి. ప్రజలకు బర్డ్ ఫ్లూ గురించి అవగాహన కల్పించాలి.

## దుండిగల్ మున్సిపల్

# తై బజార్ వేలం పాట లో అవకతవకలు

**ప్రచారం లేక అర్ధాంతరంగా ముగిసిన వేలం పాట**

**వ్యాపారస్తులకు బదులుగా మున్సిపల్ సిబ్బంది బంధువులే వేలం లో పాల్గొన్న వైనం**









**షణ్ముఖ వెలుగు కుత్బుల్లాపూర్ ప్రతినిధి మార్చి 24:** వ్యాపారస్తులతో మమేకం అవుతు మున్సిపల్ ఆదాయం పెంచాల్సిన అధికారులే అవగాహన లోపమా? లేక లోలోపల మమా అనిపించి ముగించేయాలనే ఆలోచన గాని మొత్తానికి దుండిగల్ మున్సిపల్ లో తై బజారు వేలం పాట ఎట్టకేలకు అర్ధంతరంగా ముగిసింది. వేలం పాటలో వ్యాపారస్తులకు బదులుగా కార్యాలయం లో వివిధ విభాగాల్లో పని చేసే సిబ్బంది బంధువులే వేలంపాటలో పాల్గొనటం విశేషం మేడ్చల్ జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపల్ లో సోమవారం మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో తై బజార్ వేలం పాట నిర్వహించారు. ముందస్తుగా పత్రిక ప్రకటన, వార్డు ఆఫీస్ లో నోటీస్ బోర్డు ప్రదర్శన, వివిధ రకాలుగా ప్రచారం చేపట్టాల్సిన మున్సిపల్ అధికారులు కేవలం ఒక పత్రిక లో ప్రకటన ఇచ్చి నామ మాత్రంగా పంపించి ప్రచారం లేకుండా వేలం పాట మమా అనిపించేలా చేపట్టారు. మున్సిపల్ పరిధిలో వ్యాపారస్థులకు ఎటువంటి సమాచారం లేకపోవడం వలన 25 తై బజార్ లకు కేవలం మూడు (03) దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. నిబంధనలు ప్రకారం ఒక్కొక్క వ్యాపారస్తుడు 1లక్ష డి డి చెల్లించి, 100 రూపాయలు దరఖాస్తు ఫీజ్ చెల్లించి వేలం పాటలో పాల్గొన్నారు. దరఖాస్తులు ఎక్కువ లేక పోయియినా దీంతో చేసేది లేక అధికారులు సాయంత్రం కార్యాలయం లో రెవిన్యూ ఆఫీసర్ సమక్షంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాట లో అధికారులు నిబంధనలు ప్రకారం స్రూట్రిటి చేపట్టగా సరైనా పత్రాలు లేకపోవటం కారణం చేత రెండు దరఖాస్తులు రిజెక్టు అయ్యాయి. అందులో చివరికి ఒక్క వ్యక్తి మాత్రమే బరిలో నిలువగా ఒక్కరికి తై బజార్ టెండర్ ఇవ్వటం కుదరదు అని రూల్స్ ఒప్పుకోవని మరో సారి వేలం పాట వేయాలని అధికారులు నిర్ణయించారు. వేలం పాటలో పాల్గొన్న ఆ ముగ్గురు మున్సిపల్ సిబ్బంది బంధువులే ఆశావహులు, వ్యాపారాస్తుల మధ్య కొలహాలంగా జరగాల్సిన తై బజార్ వేలం పాట దుండిగల్ మున్సిపల్ కమిషనర్ నిర్లక్ష్యం వలనో లేక కింది స్థాయి సిబ్బంది అతి హుషార్ వలనో గాని వేలం పాట నవ్వుల పాలు అయ్యింది. వేలం పాట లో పాల్గొన్న ముగ్గురు దరఖాస్తు దారులు ఒకరు జవాన్ తరపు వారు కాగా మరో వ్యక్తి అటెండర్ తమ్ముడు మరో వ్యక్తి ట్రేడ్ లైసెన్స్ జారీ చేసే వ్యక్తి కి చెందిన మనిషి అవటం విశేషం. మొత్తానికి తై బజార్ వేలం పాట మరో రోజుకు పెండింగ్ పడటం అధికారుల పనితీరుకు నిదర్శనం

# గిరిజన తండాల్లో ఎక్సైజ్ అధికారుల దాడులు







**వంద లీటర్ల బెల్లం పానకం ధ్వంసం**

**11 లీటర్ల నాటుసారా పట్టివేత**

**ముగ్గురిపై కేసు నమోదు**

**షణ్ముఖ వెలుగు ఎల్లారెడ్డి పేట మండల ప్రతినిధి.మార్చి 24:** ఎల్లారెడ్డి పేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని రాజన్న పేట, కిస్టు నాయక్ గుండారం గ్రామాల్లోని గిరిజన తండాల్లో ఎల్లారెడ్డి పేట ఎక్సైజ్ సిఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో సిరిసిల్ల డిటీఎఫ్ ఎస్ ఐ శైలజ,కరీంనగర్ ఏసి ఎన్ఫోర్స్మెంట్ ఎస్సై మాజిద్ ల నేతృత్వంలో జరిగిన దాడుల్లో నాటు సారా తయారీకి నిలువ చేసిన వంద లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి 11 లీటర్ల నాటుసారా ను పట్టుకొని నాటు సారా తయారు చేసి విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎల్లారెడ్డి పేట ఎక్సైజ్ సిఐ శ్రీనివాస్ తెలిపారు. నిషేధిత నాటు సారాయి తయారు,విక్రయాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాటు సారా తయారు దారుల,విక్రయ దారుల సమాచారం ఇవ్వాలని ప్రజలను సిఐ కోరారు ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది రాజు,కిషోర్,మల్లేష్,యోగి వర్మ,లలిత ,సుమన్,రాకేష్ లు పాల్గొన్నట్లు ఎక్సైజ్ సిఐ తెలిపారు.

## పశు వైద్య శిబిరాలను

# రైతులు సద్వినియోగం చేసుకోవాల

**రాజన్న సిరిసిల్ల జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి**





పశు వైద్యాధికారుల ద్వారా నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకొని తమ పశువులకు వైద్య పరీక్షలు చేయించుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రెడ్డి తెలిపారు. ఎల్లారెడ్డి పేట మండలంలోని పధిర గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ నరేందర్ రెడ్డి బొప్పాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎస్కే సాబేరా బేగం తో కలిసి ప్రారంభించారు

ఈ సందర్భంగా జిల్లా పశు వైద్యాధికారి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోని రైతులు పశువులను పోషిస్తూ వ్యవసాయంలో భాగంగా రైతులు పాడి పరిశ్రమను ఏర్పాటు చేసుకుంటున్నారని,తద్వారా వచ్చే డబ్బులను తమ నిత్య అవసరాలకు వాడుకుంటున్నారని అన్నారు.

ప్రతి రైతు ఇంటి ముందు కనీసం రెండు పాడి పశువులు వుండేలా తెలంగాణలో ఆచారం ఉందన్నారు .పాడి పశు వులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు వచ్చినా తక్షణం తమను సంప్రదించవచ్చని తెలిపారు. మార్కెట్ కమిటీల ద్వారా మందులను కొనుగోలు చేసి పశువులకు వచ్చే రకరకాల జబ్బులను నయం చేసే మందులను ఉచితంగా పంపిణీ చేస్తామని జిల్లా పశు వైద్యాధికారి తెలిపారు. జిల్లాలో ప్రతి గ్రామంలో పశువైద్య శిబిరాలు నిర్వహించటానికి తనతో పాటు తన పశువైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారని అన్నారు . రైతులు పంటలతో పాటు పశువులను పెంచుకోవడం రెండవ ప్రాధాన్యత గా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం రైతుల కోసం ఒకవైపు , పాడి పశువుల పై మరో వైపు సబ్సిడీలను ఇస్తూ పంటలకు గిట్టుబాటు ధరలను కూడా అందిస్తుందని అన్నారు. పశువులకు సీజనల్ గా వచ్చే వ్యాధులకు టీకాలను సకాలంలో వేస్తున్నామని తెలిపారు.

పాడి పశువులతో రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని తమ కోరిక అని అన్నారు.

ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ రాహుల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాటి రామ్ రెడ్డి మార్కెట్ కమిటీ కార్యదర్శి సునీల్, జిల్లా ఉపాధ్యక్షులు షేక్ గౌస్ , జిల్లా కార్యదర్శి వంగ మల్లారెడ్డి, డైరెక్టర్లు లక్ష్మారెడ్డి , తిరుపతి రెడ్డి, రాజేందర్ ,బాలయ్య, గంట లక్ష్మి, నారాయణరెడ్డి, నాయకులు గంట బుచ్చగౌడ్, ఎల్లయ్య, వెంకటేష్ మూర్తి శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మణ్ పరశురాములుతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## పసిడి ప్రియులకు అలర్ట్.. తగ్గిన బంగారం ధరలు..



పసిడి, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి.. వాస్తవానికి గత కొంత కాలం నుంచి బులియన్ మార్కెట్‌లో బంగారం వెండి ధరలు భారీగా పెరిగాయి.. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల ప్రకారం.. ధరల్లో ప్రతిరోజు మార్పులు, చేర్పులు జరుగుతుంటాయి. పసిడి, వెండి ధరలు పరుగులు పెడుతున్నాయి. కనీవినీ ఎరుగని రీతిలో ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి.. వాస్తవానికి గత కొంత కాలం నుంచి బులియన్ మార్కెట్‌లో బంగారం వెండి ధరలు భారీగా పెరిగాయి.. అంతర్జాతీయంగా జరుగుతున్న పరిణామాల ప్రకారం.. ధరల్లో ప్రతిరోజు మార్పులు, చేర్పులు జరుగుతుంటాయి.. ఒక్కోసారి ధరలు తగ్గితే.. మరికొన్నిసార్లు పెరుగుతూ వస్తుంటాయి. తాజాగా.. బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి.. 24 మార్చి 2025 సోమవారం ఉదయం ఆరు గంటల వరకు పలు వెబ్‌సైట్లలో నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా 22 క్యారెట్ల గోల్డ్ పది గ్రాముల ధర రూ. 82,290 ఉండగా.. 24 క్యారెట్ల 10గ్రాముల ధర రూ. 89,770 గా ఉంది. వెండి కిలో ధర రూ. 1,00,900 గా ఉంది. బంగారం పది గ్రాములపై రూ. 10 మేర.. వెండి కిలోపై రూ. 100 మేర ధరలు తగ్గాయి.. అయితే.. ఈ ధరలు ప్రాంతాల వారీగా మారుతుంటాయి. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ. 82,290, 24 క్యారెట్ల ధర రూ. 89,700 గా ఉంది. విశాఖపట్నం, విజయవాడ నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ. 82,290, 24 క్యారెట్ల ధర రూ. 89,700లుగా ఉంది. ఢిల్లీలో 10 గ్రాముల 22 క్యారెట్ల పసిడి ధర రూ. 82,440, 24 క్యారెట్ల ధర రూ. 89,970 గా ఉంది. ముంబైలో 22 క్యారెట్ల ధర రూ. 82,290, 24 క్యారెట్ల ధర రూ. 89,770 గా ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల ధర రూ. 82,290, 24 క్యారెట్ల రేటు రూ. 89,770 గా ఉంది. బెంగళూరులో 22 క్యారెట్ల ధర రూ. 82,290, 24 క్యారెట్ల ధర రూ. 89,770 గా ఉంది.